# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

సంపుటి: 2 | సంచిక: 346 | పేజీలు: 4 | వెల: రూ.4/- | శుక్రవారం 1 ఆగస్టు 2025 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


## తమిళనాడులో ఎన్డీయేకు పన్నీర్ సెల్వం షాక్!

తమిళనాడు, జులై 31 (నమస్తే ఉదయం)

తమిళనాడు రాజకీయాల్లో ఎన్డీయేకు ఎదురుదెబ్బ తగిలింది. మాజీ ముఖ్యమంత్రి పన్నీర్ సెల్వం ఎన్డీయే నుంచి వైదొలిగారు. ఈ మేరకు మాజీ మంత్రి, పన్నీర్ సెల్వంకు నమ్మినబంటు అయిన రామచంద్రన్ ప్రకటించారు. ఎన్డీయే నుంచి బయటకు వస్తున్నట్లు రామచంద్రన్ ప్రకటిస్తున్న సమయంలో పన్నీర్ సెల్వం కూడా అక్కడే ఉన్నారు. అంతకుముందు, ఉదయపు నడక సమయంలో ముఖ్యమంత్రి స్టాలిన్‌ను పన్నీర్ సెల్వం కలిశారు. వీరి మధ్య తమిళ రాజకీయ అంశాలు చర్చకు వచ్చినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఎన్డీయే నుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించడం గమనార్హం. 2026లో అసెంబ్లీ ఎన్నికలు ఉన్న నేపథ్యంలో పన్నీర్క సెల్వం రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తారని రామచంద్రన్ తెలిపారు. పొత్తుల గురించి ఇప్పుడే ఏమీ చెప్పలేమని ఆయన పేర్కొన్నారు.

# హైకోర్టులో నలుగురు కొత్త జడ్జిల ప్రమాణస్వీకారం



**జస్టిస్ గాడి ప్రవీణ్ కుమార్, జస్టిస్ రామకృష్ణా రెడ్డి జస్టిస్ సుద్దాల చలపతిరావు, జస్టిస్ గౌస్ మీరా మొహియుద్దీన్ ప్రమాణస్వీకారం**

**ప్రమాణం చేయించిన సీజే జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్**

**ఈ కార్యక్రమానికి హాజరైన పలువురు న్యాయమూర్తులు, లాయర్లు**

హైదరాబాద్, జులై 31 (నమస్తే ఉదయం)

తెలంగాణ హైకోర్టులో కొత్తగా నియమితులైన నలుగురు జడ్జిలు గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. జస్టిస్ గాడి ప్రవీణ్ కుమార్, జస్టిస్ రామకృష్ణా రెడ్డి, జస్టిస్ సుద్దాల చలపతిరావు, జస్టిస్ గౌస్ మీరా మొహియుద్దీన్‌తో సీజే జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ ప్రమాణం చేయించారు. హైకోర్టులో జరిగిన ఈ కార్యక్రమానికి పలువురు న్యాయమూర్తులు, లాయర్లు హాజరయ్యారు. హైకోర్టులో లాయర్లుగా ఉన్న ఈ నలుగురిని జడ్జిలుగా నియమించాలంటూ సుప్రీంకోర్టు కొలీజియం కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. దీంతో వారి నియామకానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ నెల 28న ఆమోదముద్ర వేశారు. దీంతో రాష్ట్ర హైకోర్టులో జడ్జిల సంఖ్య 30కి చేరింది.

## పార్టీ ఫిరాయింపులపై
# పార్లమెంట్ సమీక్షించాలి




**3 నెలల్లోగా నిర్ణయం తీసుకోవాల్సిందే**

**పార్టీ ఫిరాయింపులపై స్పీకర్‌దే తుది నిర్ణయం**

**బిఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిరాయింపు కేసులో సుప్రీం తీర్పు**

న్యూఢిల్లీ, జులై 31 (నమస్తే ఉదయం)

జూలై31(ఆర్ఎన్ఎ): తెలంగాణలో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పిటిషన్‌ను అనుమతించిన సుప్రీం ధర్మాసనం.. వీలైనంత త్వరగా లేదా 3 నెలల్లోగా స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. అయితే, ఫిరాయింపు ఎమ్మెల్యేలపై సుప్రీంకోర్టు వేటు వేయాలంటూ బీఆర్ఎస్ చేసిన విజ్ఞప్తిని సీజేఐ గవాయ్ తోసిపుచ్చారు. అదే సమయంలో హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు కొట్టివేసింది. స్పీకర్ నిర్ణయానికి కాలపరిమితి విధించాలనే అంశంపై పార్లమెంట్ నిర్ణయం తీసుకోవాలని సీజేఐ గవాయ్ ఆదేశించారు.

కాగా, ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయింపుల కేసుపై సుప్రీంకోర్టులో సుదీర్ఘ వాదనలు జరిగాయి. స్పీకర్ తగిన సమయంలో నిర్ణయం తీసుకోవాలనే అంశంలో కోర్టులు జోక్యం చేసుకోవచ్చా లేదా అనే దానిపై సుప్రీంకోర్టులో సుదీర్ఘ వాదనలు నడిచాయి. ఈ వాదనల అనంతరం ఈ ఏడాది ఏప్రిల్ 3వ తేదీన జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం తీర్పు రిజర్వ్ చేసింది. బిఆర్ఎస్ నుంచి పార్టీ మారిన 10 ఎమ్మెల్యేలపై అనర్హత చర్యలను వీలైనంత త్వరగా లేదా 3 నెలల్లోపు నిర్ణయించాలని సూచించింది. ఏ ఎమ్మెల్యే అయినా.. స్పీకర్ ప్రక్రియను పొడిగించాలని అడగకూడదు. అలా చేస్తే స్పీకర్

..మిగతా 2లో




మీడియాతో మాట్లాడుతున్న తెలంగాణ రాష్ట్ర స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

## సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ గవాయ్ తీర్పుపై
# ఇప్పుడే స్పందించలేను
## స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

బుద్వేల్, జూలై 31 (నమస్తే ఉదయం): ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపులపై మూడు నెలలలోగా స్పీకర్ నిర్ణయం తీసుకోవాలన్న సుప్రీంకోర్టు తుది తీర్పుపై తానిప్పుడేమి స్పందిం చలేనని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. కాటేదాన్ లో గురువారం జరిగిన ఓ కార్యక్రమ ంలో పాల్గొన్న ఆయనను సుప్రీం కోర్టు చీఫ్ జస్టిన్ గవాయ్ ఇచ్చిన తీర్పుపై స్పందించమని జర్నలిస్టులు కోరగా ఆయన పై విదంగా స్పందించారు. సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ గవాయ్ ఇచ్చిన తీర్పు కాపీ అందాక, దానిపై న్యాయ నిపుణులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు.

# తీర్పును స్వాగతించిన కేటీఆర్
## 3 నెలల్లో ఉప ఎన్నికలు తప్పవని వ్యాఖ్య

హైదరాబాద్, జులై 31 (నమస్తే ఉదయం)

'సత్యమేవ జయతే' అని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఎక్స్‌లో పోస్టు చేశారు. తెలంగాణలో పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేల అనర్హతపై 3 నెలల్లోపు స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ఆయన ఈమేరకు స్పందించారు. సర్వోన్నత న్యాయస్థానం తీర్పును భారత రాష్ట్ర సమితి స్వాగతిస్తోందన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడిన సీజేఐకి దన్యవాదాలు తెలిపారు. రాహుల్ గాంధీ చెప్పే పాంచ్ న్యాయ సూత్రకు కట్టుబడి ఉండాలి. చట్టవిరుద్ధంగా 10 మంది పార్టీ మారారని చెప్పేందుకు దర్యాప్తు అవసరం లేదు. కష్ట సమయాల్లో మాతో నిలిచిన భారత రాష్ట్ర సమితి లీగల్ టీమ్‌కు ధన్యవాదాలు. 10 నియోజకవర్గాల్లో ఉపఎన్నికకు 3 నెలల సమయం ఉంది. పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని కేటీఆర్ పేర్కొన్నారు. దేశం యొక్క ప్రజాస్వామ్య నిర్మాణం హానికరమైన పద్ధతుల ద్వారా క్షీణించకుండా చూసుకున్నందుకు గౌరవనీయ ప్రధాన న్యాయమూర్తికి మేము కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాలను పటిష్టం చేయాలని, ఫిరాయింపులపై ఆటోమేటిక్ రద్దు చేయాలని తన పంచ న్యాయ్‌లో వాదించిన రాహుల్ గాంధీ ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తారని ఆశిస్తున్నాను. మిస్టర్ గాంధీ, మీ స్వంత ఉపదేశాలకు కట్టుబడి ఉండమని నేను మీకు చెబుతున్నాను అని కేటీఆర్ పేర్కొన్నారు.గౌరవనీయులైన స్పీకర్ పదవిని మీరు, మీ పార్టీ భారత రాజ్యాంగాన్ని అపహాస్యం చేయడానికి ఉపయోగించుకోరని నేను ఆశిస్తున్నాను. ఈ 10 మంది ఎమ్మెల్యేలు అక్రమంగా కాంగ్రెస్ పార్టీలో చేరి ప్రతిరోజూ అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని అంగీకరించడానికి పెద్దగా పరిశోధన అవసరం లేదు అని కేటీఆర్ తెలిపారు.



## జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్
# నివేదిక సమర్పణ



**15 నెలల పాటు విచారించిన కమిషన్**

**కెసిఆర్, ఈటెల, హరీష్, తదితరులు విచారణ**

**115 మందిని విచారించి నివేదిక రూపొందించిన కమిషన్**

హైదరాబాద్, జులై 31 (నమస్తే ఉదయం)

కాళేశ్వరంపై విచారణ చేపట్టిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ తన నివేదికను సమర్పించింది. నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జాకు నివేదిక అందజేసింది. 2024 మార్చి 14న కమిషన్‌ను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ 15 నెలల పాటు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఆనకట్టలకు సంబంధించి విచారించింది. ఇందులో కెసిఆర్, హరీష్ రావు, ఈటెల రాజేదర్ సహా నీటిపారుదల శాఖ అధికారులను విచారించింది. 115 మందిని విచారణ చేసి సాక్ష్యాలు నమోదు చేసింది. కమిషన్ నివేదికతో రాహుల్ బొజ్జా సచివాలయానికి బయల్దేరారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుకు నివేదిక అందించనున్నారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీ 2023 ఆఖర్లో కుంగడం, పియర్స్ దెబ్బతినడంతో పాటు- అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో సీపేజీ సమస్యలు ఉత్పన్నమయ్యాయి. 2023 డిసెంబరులో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం... మేడిగడ్డ బ్యారేజీ దెబ్బతినడం, మిగిలిన బ్యారేజీల్లో సీపేజీ సమస్యలు ఏర్పడటంపై విజిలెన్స్ విచారణతోపాటు- నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ-(ఎన్డీఎస్ఏ)తో అధ్యయనం

..మిగతా 2లో

## ఇక్రిశాట్, కావేరీ విశ్వవిద్యాలయం అగ్రి టెక్ విద్య, పరిశోధన, ఆవిష్కరణలను

# ముందుకు తీసుకెళ్లడానికి అవగాహన ఒప్పందం

హైదరాబాద్, జూలై 31 (నమస్తే ఉదయం): భారతదేశం, గ్లోబల్ సౌత్ ప్రాంతాల్లో వాతావరణానికి అనుగుణంగా వ్యవసాయాన్ని ముందుకు తీసుకెళ్లడానికి, తర్వాతి తరం ప్రతిభను పెంపొందించడానికి ఒక వ్యూహాత్మక చర్యగా, ఇంటర్నేషనల్ క్రాప్స్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఫర్ ది సెమీ-ఎరిడ్ ట్రాపిక్స్ (ఇక్రిశాట్), కావేరీ విశ్వవిద్యాలయం లు గురువారం అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ ఒప్పందం పరిశోధన సహకారం, సాంకేతికత అభివృద్ధి, విద్యార్థి మార్పిడి కార్యక్రమాలను ప్రోత్సహిస్తుందని తెలిపారు. ఈ ఒప్పందంపై ఇక్రిశాట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ హిమాంశు పాఠక్, కావేరీ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ వి. ప్రవీణ్ రావు లు సంతకాలు చేశారు. తెలంగాణలోని సిద్దిపేట జిల్లా, గౌరారంలోని విశ్వవిద్యాలయ ప్రాంగణంలో జరిగిన ఒక వేడుకలో ఛాన్సలర్ జి.వి. భాస్కర్ రావు సమక్షంలో ఈ సంతకాలు చేశారు. భవిష్యత్తు-సిద్ధంగా ఉన్న వ్యవసాయం కోసం వ్యూహాత్మక సమన్వయం చేయడానికి జరిగిన అవగాహన ఒప్పందం కార్యక్రమంలో డాక్టర్ హిమాంశు పాఠక్ మాట్లాడుతూ, ప్రపంచ వ్యవసాయంలోని బహుముఖ సవాళ్లను ఎదుర్కోవడానికి విద్యా సంస్థలు, అంతర్జాతీయ పరిశోధన కేంద్రాలు దగ్గరి



అవగాహన ఒప్పందాలను మార్చుకుంటున్న ఇక్రిశాట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ హిమాంశు పాఠక్, కావేరీ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ వి ప్రవీణ్ రావు లు

సహకారంతో పనిచేయవలసిన అవసరం ఉందన్నారు.

"వ్యవసాయ భవిష్యత్తు విజ్ఞానం, సాంకేతికత, విద్య, విధానాలను ఎంతగా సమగ్రపరుస్తామనే దానిపై ఆధారపడి ఉంటుందన్నారు . కావేరీ విశ్వవిద్యాలయంతో ఈ భాగస్వామ్యం తర్వాతి తరం అగ్రి -ఆవిష్కర్తలను తయారు చేయడానికి, పరిశోధన ఫలితాలు నిజమైన ప్రపంచ ప్రభావాన్ని చూపడానికి ఒక పెట్టుబడి అన్నారు. ముఖ్యంగా చిన్న రైతులకు," ఎంతో ఉపయోగం అని డాక్టర్ హిమాంశు పాఠక్ అన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఇక్రిశాట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ హిమాంశు పాఠక్

**ఈ భాగస్వామ్యం యొక్క లక్ష్యాలు :**

- వాతావరణ-స్మార్ట్ వ్యవసాయం, డిజిటల్ ఫార్మింగ్, పంటల సంకరణ, బయో-ఇన్నోవేషన్లలో ఉమ్మడి పరిశోధన కార్యక్రమాలను సులభతరం చేయడం
- విద్యార్థి, ఫ్యాకల్టీ మార్పిడి కార్యక్రమాలను ప్రోత్సహించడం
- ఇక్రిశాట్ యొక్క అంతర్జాతీయ నైపుణ్యం, కావేరీ విశ్వవిద్యాలయం యొక్క స్థానిక, టెక్-ఆధారిత పాఠ్యాంశాలను ఉపయోగించుకోవడం జరుగుతుందన్నారు.

# ప్రతి చిన్నారికి ఇంటి ముంగిట్లోనే చదువు: మంత్రి శ్రీహరి

మక్తల్ జూలై 31(నమస్తే ఉదయం): చిన్నారికి ఇంటి ముంగిట్లోనే చదువు : మంత్రి శ్రీహరి అన్నారు. ఇక నడకల రోజులు కాదు - కాలనీలలోనే విద్యారంభం విద్య అందుబాటులోకి - బాపు జగ్జీవన్ రామ్ కాలనీ, బీసీ కాలనీలో స్కూళ్ల ప్రారంభం.తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక, డైరీ అభివృద్ధి, క్రీడలు, యువజన సేవలు , మత్స్యశాఖ మంత్రి డా. వాకిటి శ్రీహరి మక్తల్ నియోజకవర్గ అభివృద్ధి పట్ల కట్టుబాటుతో ఉన్నారన్నారు.ప్రతీ వాడా, ప్రతీ పల్లె వరకు ప్రభుత్వ సేవలు చేరాలని, ముఖ్యంగా విద్య, ఆరోగ్య రంగాల్లో వెనుకబడిన వర్గాలు మరింత ముందుకు రావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దళితవాడల్లో విద్యకు దూరంగా ఉన్న చిన్నారుల పరిస్థితిని గుర్తించి, పాఠశాలకు వెళ్లేందుకు ఒకటి రెండు కిలోమీటర్లు నడవాల్సిన అవసరం లేకుండా




చేయాలని ఈ దృష్టితోనే బాపు జగ్జీవన్ రామ్ కాలనీ, బీసీ కాలనీలో నూతనంగా మంజూరైన ప్రాథమిక పాఠశాలలను ప్రారంభించారు.ఇవి చిన్నారులకు నాణ్యమైన ప్రాథమిక విద్యను ఇంటి వద్దే అందించేందుకు ఏర్పాటు చేయబడ్డాయి.




ఈ కార్యక్రమంలో మంత్రి వాకిటి శ్రీహరి డిఇఓ వెంకట్రాములు ఎంఈఓ అనిల్ గౌడ్, ఉపాధ్యాయ బృందం, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మండల నాయకులు పాల్గొన్నారు.




## తెలంగాణ స్పోర్ట్స్ కాంక్లేవ్ పోస్టర్ ఆవిష్కరణ

మక్తల్ జూలై 31(నమస్తే ఉదయం) మంత్రి వాకిటి శ్రీహరి చేతుల మీదుగా ఫస్ట్ ఎడిషన్ పోస్టర్ విడుదల తెలంగాణ రాష్ట్ర మంత్రి వర్యులు డా. వాకిటి శ్రీహరి తెలంగాణ ఫస్ట్ ఎడిషన్ స్పోర్ట్స్ కాంక్లేవ్ పోస్టర్‌ను ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి ఆత్మకూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ రహమతుల్లా మండల అధ్యక్షుడు పరమేష్, పట్టణ అధ్యక్షుడు శ్రీను, తదితర మండల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



## పార్టీ ఫిరాయింపులపై

# పార్లమెంట్ సమీక్షించాలి

**మొదటి పేజీ తరువాయి...**

ప్రతికూల నిర్ణయాలు తీసుకోవచ్చు. రాజకీయ ఫిరాయింపులు జాతీయ చర్చనీయాంశంగా మారింది. దాన్ని అరికట్టకపోతే.. ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసే శక్తి దానికి ఉందని వ్యాఖ్యానించారు. వివిధ సందర్భాల్లో ఈ అంశంపై పార్లమెంటులో చేసిన వివిధ ప్రసంగాలను కూడా పరిశీలించాం. రాజేష్ పైలట్.. దేవేంద్ర నాథ్ మున్ని లాగా.. అనర్హత చర్యలపై స్పీకర్ నిర్ణయం తీసుకోవడం కోర్టుల ముందు జాప్యాన్ని నివారించడమే. పార్టీ మారిన వారిపై చర్యలు తీసుకునే అధికారం స్పీకర్‌కు కట్టబెట్టారు. ఆర్టికల్స్ 136, 226, 227 లకు సంబంధించి న్యాయ సమీక్ష అధికారాలు చాలా పరిమితంగా ఉన్నాయి. తెలంగాణ హైకోర్టు సింగిల్ జడ్జి ఆదేశాల్లో జోక్యం చేసుకోవడంలో డివిజన్ బెంచ్ తప్పు చేసింది. స్పీకర్ ఒక న్యాయనిర్ణేత అధికారిగా వ్యవహరిస్తూనే హైకోర్టు, సుప్రీంకోర్టు అధికార పరిధికి లోబడి ఉండే ట్రిబ్యునల్‌గా వ్యవహరిస్తారని తీర్పులో ధర్మాసనం స్పష్టం చేసింది. తెలంగాణ హైకోర్టు డివిజన్ బెంచ్ 2014 నవంబర్ 22న తీర్పును పక్కన పెడుతున్నాము. ఒక ముఖ్యమైన నిర్ణయంలో శాసనసభ స్పీకర్‌లు ప్రజాస్వామ్యానికి ప్రమాదం కలిగించే ఫిరాయింపుదారులపై చర్యలు తీసుకునే విషయంలో ఆలస్యం చేస్తారు. కాబట్టి, ఫిరాయింపు నిరోధక చట్టం కింద ఎమ్మెల్యేల అనర్హతపై ప్రస్తుతం ఉన్న యంత్రాంగాన్ని పార్లమెంటు సమీక్షించాల్సిన అవసరం ఉంది. ఇటువంటి చర్యలు సంవత్సరాల తరబడి సాగడం అర్థరహితంగా అని పేర్కొంది. ఈ అంశంపై సుప్రీంకోర్టు నోటీసు జారీ చేసిన తర్వాత మాత్రమే స్పీకర్ ఎమ్మెల్యేలకు నోటీసు జారీ చేయడం దురదృష్టకరం అని వ్యాఖ్యానించింది. అపరేషన్ సక్సెస్.. పేషెంట్ డైడ్' అన్న సూత్రం వర్తించకూడదని వ్యాఖ్యానించింది.ఒక ముఖ్యమైన నిర్ణయంలో శాసనసభ స్పీకర్‌లు ప్రజాస్వామ్యానికి ప్రమాదం కలిగించే ఫిరాయింపుదారులపై చర్యలు తీసుకునే విషయంలో ఆలస్యం చేస్తారు. కాబట్టి, పార్టీ ఫిరాయింపు నిరోధక చట్టం కింద ఎమ్మెల్యేల అనర్హతపై ప్రస్తుతం ఉన్న యంత్రాంగాన్ని పార్లమెంటు సమీక్షించాలి. ఇలాంటి చర్యలు ఏళ్ల తరబడి సాగడం వల్ల అర్థరహితంగా మారుతుందని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలంటూ తాము దాఖలు చేసిన అనర్హత పిటిషన్లపై స్పీకర్ నిర్దిష్ట గడువులోగా నిర్ణయం తీసుకొనేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ భారత రాష్ట్ర సమితి, ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, ఎమ్మెల్యేలు పాడికౌశిక్‌రెడ్డి, కేపీవివేకానంద, జి.జగదీశ్‌రెడ్డి, పల్లారాజేశ్వర్‌రెడ్డి, చింతా ప్రభాకర్, కల్వకుంట్ల సంజయ్, భాజపా శాసనసభాపక్ష నాయకుడు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి వేర్వేరుగా సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ ఏడాది జనవరి 15న దాఖలు చేసిన పిటిషన్లు సుప్రీంకోర్టులో తొమ్మిదిసార్లు విచారణకు వచ్చాయి. జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ ఆగస్టిన్ జార్జ్ మసీహ్‌లతో కూడిన ధర్మాసనం అన్నిపక్షాల వాదనలు విన్న తర్వాత ఏప్రిల్ 3న తీర్పును రిజర్వు చేసింది. ఇందులో ప్రతివాదులుగా తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్యేలు పి.శ్రీనివాసరెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, కాలె యాదయ్య, టి.ప్రకాశ్‌గౌడ్, ఎ.గాంధీ, గూడెం మహిపాల్‌రెడ్డి, ఎం.సంజయ్‌కుమార్‌లు ఉన్నారు.

# రాష్ట్రంలోనే అత్యుత్తమ క్రీడా పాఠశాలను వరంగల్‌లో ఏర్పాటు చేయాలి: ఎమ్మెల్యేలు

**జాతీయ స్థాయి ప్రమాణాలతో వసతులు కల్పించాలి**

**పూర్తి స్థాయిలో పాఠశాల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలి**

**తాత్కాలికంగా ఏర్పాటు చేయనున్న జెఎన్ఎస్‌లో వెంటనే మరమ్మత్తులు చేపట్టాలి**

**విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేయాలి**

వరంగల్ జులై 31 (నమస్తే ఉదయం బ్యూరో): తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ సెంట్రల్ ఆఫ్ ఎక్సలెన్సీ పాఠశాల ఏర్పాటు పై హన్మకొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు, మేయర్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్ పాయి లతో కలిసి ఎమ్మెల్యే కడియం శ్రీహరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ జాతీయ స్థాయి ప్రమాణాలతో



రాష్ట్రంలోనే అత్యుత్తమ క్రీడా పాఠశాలను వరంగల్ లో ఏర్పాటు చేయాలనీ స్పోర్ట్స్ అథారిటీ అధికారులకు సూచించారు. ముందుగా వరంగల్ లో స్పోర్ట్స్ సెంట్రల్ ఆఫ్ ఎక్సలెన్సీ పాఠశాల ఏర్పాటుకు ఆమోదం తెలిపిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు. ఆగస్టు 15నుండి క్రీడా పాఠశాల ప్రారంభించడానికి అవసరమైన చర్యలను వెంటనే తీసుకోవాలని అన్నారు. ప్రస్తుతం జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో తాత్కాలిక క్రీడా పాఠశాల ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ ఏడాది 80మంది విద్యార్థులతో క్రీడా పాఠశాలను ప్రారంభం కానున్నట్లు తెలిపారు. అందుకు అవసరమైన మరమ్మత్తులను వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు హాస్టల్ వసతి, ఇండోర్, అవుట్ డోర్ క్రీడలకు కావాల్సిన ఏర్పాట్లు, తరగతి గదులను ఏర్పాటు చేయాలనీ సూచించారు. తాత్కాలికంగానే ఏర్పాటు చేస్తున్న సుమారు 2సంవత్సరాల పాటు విద్యార్థులు ఉండనున్న నేపథ్యంలో పనుల్లో నాణ్యత పాటించాలని అన్నారు. పాఠశాల ఏర్పాటుకు సంబందించిన జీవోను విడుదలకు తాము కృషి చేస్తామని, అధికారులు త్వరితగతిన ఏర్పాట్లు పూర్తి చేయాలనీ సూచించారు. అలాగే జీవో విడుదల అయిన వెంటనే జిల్లా కలెక్టర్ భూ బాధలయింపుకు కావాల్సిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం జాతీయ స్థాయి ప్రమాణాలతో, అన్ని హంగులతో కూడిన అత్యుత్తమ పాఠశాల నిర్మాణానికి సంబందించిన డిపిఆర్ సిద్ధం చేయాలనీ సూచించారు. రేపు ఉదయం 9గంటలకు జవహర్ లాల్ నెహ్రూ స్టేడియాన్ని అందరం కలిసి పరిశీలిద్దామని, అవసరమైన మరమ్మత్తులు, మౌలిక వసతుల కల్పనపై అక్కడే చర్చిద్దామని అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ అధికారులు, జిల్లా యువజన క్రీడా అధికారులు, రెవెన్యూ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



## వ్యాపార రంగంలో వేగవంతమైన పురోగతి అవసరం: మంత్రి శ్రీహరి

మక్తల్ జూలై 31 (నమస్తే ఉదయం):లివ్యాపార రంగంలో వేగవంతమైన పురోగతి అవసరం అని మంత్రి శ్రీహరి అన్నారు. మక్తల్ మండల కేంద్రంలో పలు నూతన షాపులు ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి వాకిటి శ్రీహరి పాల్గొన్నారు. ఉద్యోగ అవకాశాల కల్పనకు కొత్త షాపులు మార్గదర్శకం మక్తల్ పట్టణ కేంద్రంలో ఏర్పాటైన వివిధ నూతన వాణిజ్య సంస్థల ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక, డైరీ అభివృద్ధి, క్రీడలు, యువజన సేవలు, మత్స్యశాఖ మంత్రి డా.వాకిటి శ్రీహరి , కాంగ్రెస్ నాయకులు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## తెలంగాణలో స్మార్ట్ సిటీ మిషన్ గడువు పెంచాలని పార్లమెంట్‌లో ప్రశ్నించిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

**స్మార్ట్ సిటీ మిషన్ గడువును జూన్ 2026 వరకు పొడిగించాలి**



వరంగల్ జూలై 31 (నమస్తే ఉదయం బ్యూరో):తెలంగాణ రాష్ట్రంలో ప్రజాప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకొని స్మార్ట్ సిటీ పనులు పూర్తయ్యే వరకు మిషన్ గడువు పెంచాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పార్లమెంట్ లో కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. గ్రేటర్ వరంగల్, కరీంనగర్ నగరాల్లో ఇంకా పూర్తి కాకపోయిన పనుల గురించి కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వరంగల్ నగరంలో కొన్ని పనులు పూర్తయ్యేలోపు స్మార్ట్ సిటీ మిషన్ గడువు ముగిసి పోయిందని, దీంతో నగర ప్రజలకు మౌలిక సదుపాయాలు అందడంలేదన్నారు. ఈ నేపథ్యంలో స్మార్ట్ సిటీ మిషన్ గడువును జూన్ 2026 వరకు పొడిగించాలని అన్నారు. వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అడిగిన ప్రశ్నకు కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి టోకెన్ సాహు రాతపూర్వక సమాధానంలో వివరాలు వెల్లడించారు. స్మార్ట్ సిటీస్ మిషన్ ఇప్పటికే మార్చి 31, 2025న ముగిసిందని, ఇకపై పొడిగింపు ఉండదని తెలిపారు. ఇంకా మిగిలిన పనులను ప్రతి నగరంలో ఉన్న ప్రత్యేక సంస్థలు ఎస్ పి వి ద్వారానే పూర్తి చేయాలని తెలిపారు. ప్రస్తుతానికి గ్రేటర్ వరంగల్‌లో రూ.1,800 కోట్లలో రూ.1,386 కోట్ల విలువైన 119 పనులు పూర్తయ్యాయి. ఇంకా రూ.415 కోట్లతో 40 పనులు జరుగుతున్నాయి. కరీంనగర్‌లో రూ.1,094 కోట్లలో రూ.979 కోట్ల విలువైన 49 పనులు పూర్తయ్యాయి. రూ.115 కోట్లతో 12 పనులు ఇంకా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కావ్య మాట్లాడుతూ స్మార్ట్ సిటీ ద్వారా పట్టణ అభివృద్ధి వేగంగా జరుగుతుందని తెలియజేశారు. మిషన్ గడువు పూర్తి అయినప్పటికీ నగర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహాయం అవసరమని పేర్కొన్నారు. ప్రస్తుతం నగరాల్లో మిగిలిన పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు.

# జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక సమర్పణ

**మొదటి పేజీ తరువాయి...**

చేయించింది. లోపాలు తీవ్రంగా ఉన్నట్లు- విజిలెన్స్ ప్రాథమిక నివేదిక సమర్పించింది. అసెంబ్లీలో చర్చ సందర్భంగా న్యాయ విచారణకు ఆదేశిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడంతోపాటు- వెంటనే కమిషన్ ఏర్పాటు-కు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి, సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి, భారతదేశ మొదటి లోక్‌పాల్‌గా 2019 నుంచి 2022 వరకు పనిచేసిన జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో 2024 మార్చిలో కమిషన్‌ను ఏర్పాటు- చేసింది. జులై ఆఖరులోగా నివేదిక ఇవ్వాలని పేర్కొంది. అయితే కమిషన్ ఏర్పాటు- ఉత్తర్వులు జస్టిస్ ఘోష్‌కు ఏప్రిల్‌లో అందగా, మే నెల నుంచి కార్యకలాపాలు ప్రారంభించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను పరిశీలించడంతోపాటు- ఎక్కువ మందిని విచారించాల్సి రావడం, క్రాస్ ఎగ్జామినేషన్, విజిలెన్స్, ఎన్డీఎస్ఏ నివేదికల పరిశీలన.. ఇలా పలు కారణాలతో కమిషన్ గడువును ప్రభుత్వం పొడిగిస్తూ వచ్చింది. ఇవాళ జస్టిస్ పీసీ ఘోష్ తన నివేదికను ప్రభుత్వానికి సమర్పించారు.

# నిందితులు ఏడుగురూ నిర్దోషులే

**ఆరోపణలు ఎదుర్కొన్న వారిలో మాజీ ఎంపీ ప్రజ్ఞా ఠాకూర్**

**17 ఏళ్ల తర్వాత తీర్పు వెలువరించిన ఎన్ఐఏ కోర్టు**

**న్యూఢిల్లీ, జులై 31 (నమస్తే ఉదయం)**



దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 2008 నాటి మాలేగావ్ పేలుళ్ల కేసులో నిందితులు అందరూ నిర్దోషులేనని ప్రత్యేక కోర్టు తీర్పు వెలువరించింది. ఈ కేసులో మాజీ ఎంపీ ప్రజ్ఞా ఠాకూర్, లెఫ్టినెంట్ కర్నల్ ప్రసాద్ పురోహిత్ సహా మొత్తం ఏడుగురు అభియోగాలు ఎదుర్కొన్నారు. సుదీర్ఘంగా జరిగిన విచారణ తర్వాత వారంతా నిర్దోషులేనని ముంబై ప్రత్యేక కోర్టు తేల్చింది. తీర్పు సందర్భంగా కోర్టు ప్రాసిక్యూషన్ వాదనలలో లోపాలను ఎత్తిచూపింది. బాంబును స్కూటర్ కు అమర్చి పేలుడు జరిపారని ప్రాసిక్యూషన్ నిర్ధారించలేకపోయిందని, తగిన ఆధారాలు చూపలేకపోయిందని పేర్కొంది. మహారాష్ట్రలోని మాలేగావ్‌లో 2008 సెప్టెంబరు 29న భారీ పేలుడు సంభవించింది. పేలుడు ధాటికి ఆరుగురు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. సుమారు వందమందికి పైగా గాయపడ్డారు. ఈ కేసును తొలుత యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ (ఏటీఎస్) దర్యాప్తు చేపట్టగా.. కేసు తీవ్రత దృష్ట్యా తర్వాత ప్రభుత్వం దీనిని నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ) కు అప్పగించింది. ఈ పేలుళ్లకు సంబంధించి అప్పటి ఎంపీ ప్రజ్ఞా ఠాకూర్ పైనా ఆరోపణలు వచ్చాయి. ప్రజ్ఞా ఠాకూర్ కు చెందిన మోటార్ సైకిల్ కు బాంబు అమర్చారని దర్యాప్తులో తేలిందని అధికారులు చెప్పారు. దీంతో ఈ కేసులో ప్రజ్ఞా ఠాకూర్ ను నిందితురాలిగా చేర్చారు. ఈ కేసులో ఇప్పటివరకు 220 మంది సాక్షులను విచారించగా.. వారిలో 15 మంది అంతకుముందు తాము ఇచ్చిన వాంగ్మూలానికి విరుద్ధంగా మాట్లాడారు.

# భారత జాతీయ వరి పరిశోధన మండలిలో ముగ్గురు శాస్త్రవేత్తల ఉద్యోగ విరమణ



డాక్టర్ ముత్తు రామన్ కు మెమెంటో బహుకరిస్తున్న ఐ ఐ ఆర్ ఆర్ డైరెక్టర్ డాక్టర్ రామన్ మీనాక్షి సుందరం



డాక్టర్ ముత్తు రామన్ ను సన్మానిస్తున్న ఫోటో గ్రాఫర్ ఎం నాగ భూషణం



డాక్టర్ సురేఖను సన్మానిస్తున్న మహిళా శాస్త్రవేత్తలు



డాక్టర్ రఘువీర్ ను సన్మానించి మెమెంటో బహుకరిస్తున్న డాక్టర్ మహేందర్ కుమార్

బుద్వేల్, జూలై 31 (నమస్తే ఉదయం): భారత దేశంలో వరి ఉత్పత్తులను ప్రోత్సహించి, అనేక నూతన వంగడాలను కనుగొని రైతాంగం సేవలో 35 నుంచి 36సంవత్సరాల పాటు శాస్త్రవేత్తలుగా పనిచేసి పదవీ విరమణ పొందిన వారి శేష జీవితం ఆయూరారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని రాజేంద్రనగర్ లోని భారత జాతీయ వరి పరిశోధన సంస్థ (ఐఐఆర్ఆర్) డైరెక్టర్ డాక్టర్ రామన్ మీనాక్షి సుందరం అన్నారు. రాజేంద్రనగర్ లోని ఐఐఆర్ఆర్ వ్యవసాయ విస్తరణ విభాగం హెడ్ గా పనిచేస్తు ఉద్యోగ విరమణ పొందిన డాక్టర్ ముత్తు రామన్, సాయిల్ సైన్స్ విభాగాధిపతిగా పనిచేస్తు ఉద్యోగ విరమణ పొందిన డాక్టర్ సురేఖ, ప్లాం ట్ ఫిజియాలజీ విభాగాధిపతిగా పనిచేస్తు ఉద్యోగ విరమణ పొందిన డాక్టర్ రఘువీర్ లను గురువారం ఘనంగా సన్మానించారు. వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఐఐఆర్ఆర్ శాస్త్రవేత్తలు డాక్టర్ మహేందర్ కుమార్, డాక్టర్ సాయి ప్రసాద్, డాక్టర్ శ్రీనివాస్ ప్రసాద్, డాక్టర్ శైలజ, డాక్టర్ పద్మకుమారి తదితరులు పాల్గొన్నారు.







# అలంపూర్‌లో మహిళా శక్తికి మరింత బలం: మంత్రి వాకిటి శ్రీహరి

## శ్రీ జోగులాంబ అమ్మవారిని దర్శించుకున్న మంత్రి శ్రీహరి, లలిత దంపతులు

మక్తల్, జూలై,31 (నమస్తే ఉదయం): అలంపూర్‌లో మహిళా శక్తికి మరింత బలం చేకూరుతుందని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా అర్హులకు రూ.5 లక్షల చొప్పున మంజూరూ రేషన్ కార్డుల పంపిణీతో లబ్ధిదారుల్లో హర్షారికేతశీ గత ఏడాది 119 కోట్లు మహిళా సంఘాలకు విడుదల - సంక్షేమ పాలనకు నిదర్శనం ఆధ్యాత్మిక విలువలకు ప్రాధాన్యమిస్తూ జోగులాంబ అమ్మవారిని మంత్రి దర్శించుకున్నారు. గురువారం అలంపూర్ చౌరస్తాలోనీ ఏజేఆర్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి మంత్రి వాకిటి శ్రీహరి ముఖ్యఅతిథిగా , జిల్లా కలెక్టర్ సంతోష్, స్థానిక శాసనసభ్యులు విజెయుడు లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ...రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికి రూ.5 లక్షలు మంజూరు చేస్తుందన్నారు. ప్రతి



సోమవారం లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా బిల్లులు జమ చేయబడతాయని తెలిపారు. గత ఏడాది మహిళా సంఘాలకు రూ.119 కోట్లు విడుదల చేశామని గుర్తు చేశారు. ఇంటి యజమానిగా మహిళ ఉంటే ఆ కుటుంబం ఆర్థికంగా బలపడుతుంది, అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజల సంక్షేమ పాలన కొనసాగుతోందని తెలిపారు. రానున్న రోజుల్లో మహిళల అభివృద్ధికి మరిన్ని పథకాలు అందిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర మంత్రి డా. వాకిటి శ్రీహరి , ఆయన సతీమణి లలిత జోగులాంబ బాల బ్రహ్మేశ్వర ఆలయాన్ని దర్శించుకున్నారు. అలంపూర్ మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యదర్శి డా. ఎస్.ఏ. సంపత్ కుమార్ , ఆయన సతీమణి మహాలక్ష్మి తో కలిసి మంత్రి దంపతులకు హరిత హోటల్ వద్ద సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్ పర్సన్ సరిత, అలశీపూర్ దేవాలయ కమిటీ సభ్యులు , కిసాన్ సెల్ అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, గ్రంథాలయ, మండల అధ్యక్షులు, ప్రజా పతినిధులు,కాంగ్రెస్ కార్యకర్తలు, మహిళలు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు



వ్యవసాయ వర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య ను కలిసి ధన్యవాదాలు తెలుపుతున్న బీసీ ఉద్యోగులు, విద్యార్థులు, అధ్యాపకులు

# వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బీసీ సెల్ ఏర్పాటు చేయడం సంతోషకరం

బుద్వేల్, జూలై 31(ప్రజాత ఉదయం): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం లో బీసీ సెల్ ఏర్పాటు కు పాలకమండలి లో తీర్మాణం చేసి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం సంతోషకరమని వర్సిటీ బీసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బిక్షపతి అన్నారు. గురువారం బీసీ ఉద్యోగులు, అధ్యాపకులు, విద్యార్థులందరు కలసి వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఆల్టాస్ జానయ్య, రిజిస్ట్రార్ డాక్టర్ జీఈసీహెచ్ విద్యాసాగర్ కు సన్మాణం చేశారు. బీసీ సెల్ ఏర్పాటు చేస్తున్నందుకు ధన్యవాదాలు తెలియజేసారు. వైస్ చాన్సలర్, రిజిస్ట్రార్లను కలసిన వారిలో బీసీ ఉద్యోగ, విద్యార్థి, అధ్యాపక సంఘం నాయకులు దశరథ్, మురళి, కవిత, సంతోష్ గౌడ్ జనార్దన్, డాక్టర్ అంజయ్య. డాక్టర్ నవీన్. డాక్టర్ సతీష్, డాక్టర్ ఉపేందర్, డాక్టర్ చైతన్య, విద్యార్థి నాయకులు లోకేశ్ లు ఉన్నారు.

**బీసీ సెల్ ఏర్పాటు చేయడం సంతోషకరం : తెలంగాణ అగ్రికల్చరల్ సైంటిస్ట్ అసోసియేషన్ (టాసా)**

వ్యవసాయ వర్సిటీ లో బీసీ సెల్ ఏర్పాటు చేయడం సంతోషకరమని తెలంగాణ అగ్రికల్చరల్ సైంటిస్ట్ అసోసియేషన్ ( టాసా) అధ్యక్షుడు డాక్టర్ కె పవన్ చంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ సల్లా సౌజన్య, ఉపాధ్యక్షులు డాక్టర్ జె కమలాకర్, సంయుక్త కార్యదర్శి డాక్టర్ పి.రమేశ్, కోశాధికారి డాక్టర్ పి.ప్రశాంత్ లు తెలిపారు. బీసీ సెల్ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్టాస్ జానయ్యకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అందుకు సహకరించిన వర్సిటీ టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులందరికి ధన్యవాదాలు తెలిపారు.



పదవీ విరమణ పొందిన ఉద్యోగులను సన్మానించిన రాజేంద్రనగర్ ఆర్టీసీ బస్సు డిపో మేనేజర్ బి కృష్ణా రెడ్డి

# రాజేంద్రనగర్ ఆర్టీసీ బస్సు డిపోలో ముగ్గురు ఉద్యోగుల పదవీ విరమణ

బుద్వేల్, జూలై 31 (నమస్తే ఉదయం): రాజేంద్రనగర్ ఆర్టీసీ బస్సు డిపో లో డ్రైవర్ గా పనిచేస్తున్న ఎండీ ఫరీద్, హెల్పర్ గా పనిచేస్తున్న మీర్జా యూసుఫ్ బేగ్, కండక్టర్ గా పనిచేసు న్న ఎ.ప్రకాశ్ లు గురువారం ఉద్యోగ విరమణ పొందారు. వారిని డిపో మేనేజర్ బి.క్రిష్ణారెడ్డి సన్మానించి అభినందించారు. ఉద్యోగ విరమణ పొందిన సిబ్బంది శేష జీవితం ఆయురారోగ్యాలతో ఉండాలని, వారి జీవితంలో సుఖ సంతోషాలను భగవంతుడు ప్రసాదిం చాలని కోరారు.



ఉద్యోగ విరమణ పొందిన డాక్టర్ జీ శ్రావణ్ కుమార్ కు పుష్ప గుచ్ఛం అందచేస్తున్న వ్యవసాయ వర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య, రిజిస్ట్రార్ డాక్టర్ జీ ఈ సీ హెచ్ విద్యా సాగర్, డీన్ పీ జీ స్టడీస్ డాక్టర్ కే బీ ఈశ్వరి, వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం గోవర్ధన్ లు



డాక్టర్ జి శ్రావణ్ కుమార్ ను సన్మానిస్తున్న టాసా ప్రతినిధులు

# వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్ జి.శ్రావణ్ కుమార్ ఉద్యోగ విరమణ

## అందరి మన్ననలను పొందిన వ్యక్తిగా డాక్టర్ శ్రావణ్ కుమార్ కు పేరు

## పరీక్షల నిర్వాహణ లో ప్రత్యేక ముద్ర

## బహుజన బాంధవునిగా పేరు తెచ్చుకున్న శ్రావణ్ కుమార్

బుద్వేల్, జూలై 31 (నమస్తే ఉదయం): 26 సంవత్సరాల ఉద్యోగ జీవితంలో అందరి మన్ననలను పొందిన వ్యక్తిగా డాక్టర్ జి.శ్రావణ్ కుమార్ పేరు తెచ్చుకున్నారని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం డీన్ పీజీ స్టడీస్ డాక్టర్ కే బీ ఈశ్వరీ. రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం. గోవర్ధన్ లు అన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాయంలో వివిధ హెూదాలలో పనిచేసిన డాక్టర్ జి.శ్రావణ్ కుమార్ గురువారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాలలో ఆయన కు ఉద్యోగ విరమణ సన్మాణ సభ ను నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న అద్యాపకులు, ఉద్యోగులు, విద్యారులు డాక్టర్ బి. విద్యాసాగర్, డాక్టర్ పవన్ చంద్రారెడ్డి, సునీత, డాక్టర్ రాజేశ్వర్ నాయక్, డాక్టర్ ఆకుల బేబీ, డాక్టర్ లతీఫ్, డాక్టర్ శ్రీనివాస్ కుమార్, డాక్టర్ సుధాకర్, డాక్టర్ సి.నరేందర్ రెడ్డి, డాక్టర్ పద్మశ్రీ, డాక్టర్ జె కమలాకర్, డాక్టర్ సల్లా సౌజన్య, క్రిష్ణారెడ్డి, డాక్టర్ త్రివేణి, డాక్టర్ సంతోష్, డాక్టర్ హరిక్రిష్ణ, వినయ్, రాజ్ కుమార్, శ్రీనివాస్ లు మాట్లాడుతూ, విద్యార్థులకు, ఉద్యోగులకు, అధ్యాపకులకు డాక్టర్ శ్రావణ్ కుమార్ ఒక అన్నగా పేరు సంపాదించుకున్నారన్నారు. ఆయన బహుజన బాంధవుడుగా నిలిచారని కొనియాడారు. తెలంగాణ ఉద్యమంలో డాక్టర్ శ్రావణ్ కుమార్ పాత్ర మరువలేనిదన్నారు. ఆడవారిని చెల్లిగా, తల్లిగా సంబోదిస్తు ఎల్లప్పుడు సానుకూల దృకృతంతో అందరితో కలసి మెలసి ఉండేవారన్నారు. విద్యార్థులకు ఎంతో సహకారం అందించేవారని గుర్తు చేశారు. కౌన్సిలింగ్ సమయంలో రిజర్వేషన్ల అమలు లో చాలా ఖచ్చితంగా ఉండి పనిచేసేవారన్నారు. డాక్టర్ జి.శ్రావణ్ కుమార్ శేష జీవితం ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని భగవంతుణ్ని ప్రార్థిస్తున్నామన్నారు. బవిష్యత్తులో ఆయన సేవలను వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపయోగించుకుం టుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం ఉద్యోగ విరమణ పొందిన డాక్టర్ జి.శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ, తన ఉద్యోగ జీవితంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్ రాజశేఖర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే దివంగత నోముల నర్సింహ్మాయ్య ఆశీస్సులు ఉన్నాయన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయంలో డాక్టర్ ఎస్ రఘువర్ధన్ రెడ్డి, డాక్టర్ కేవీఎస్ మీనా కుమారి ఎంతో సహాయ సహకారాలు అందజేశారన్నారు.

# సీఎస్ఎం ఫౌండేషన్, టీఎస్ఎస్ఓల ఆధ్వర్యంలో ఉత్తమ విద్యార్థులను సన్మానించడం సంతోషకరం

## స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్




ఉత్తమ విద్యార్థుల సన్మాన సభలో పాల్గొన్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్



మాట్లాడుతున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టీ ప్రకాష్ గౌడ్

బుద్వేల్, జూలై 31(నమస్తే ఉదయం):చదువులో రాణిస్తున్న విద్యార్థులను గుర్తించి వారిని గౌరమిచడం సంతోషకరమని తెలంగాణ రాష్ట్ర స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. చంద్ర ప్రదీప్, సూర్య ప్రణవ్, మేఘ ప్రశాంత్ (సీఎస్ఎం) పౌండేషన్, తెలంగాణ సోషల్ స్టూడెంట్ ఆర్గనైజేషన్ (టీఎస్ఎస్ఓ) ఆధ్వర్యంలో గురువారం కాటేదాన్ గ్రాండ్ ఫంక్షన్ హాల్ లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న ఉత్తమ విద్యార్థులకు నిర్వహించిన సన్మానం, మెమొంటో బహుకరణ కార్యక్రమంలో ఆయన రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్, నిర్వాహకులు సానెం శ్రీనివాస్ గౌడ్, మీసాల లక్ష్మీ నివాస్ లతో కలసి పాల్గొన్నారు. విద్యార్థులనుద్దేశించి గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ, చదువుకున్న వారికి సమాజంలో మంచి అవకాశాలు ఉన్నాయన్నారు. విద్యార్థులు ప్రాధమిక విద్య స్థాయిలో బాగా చదువుకోవాలన్నారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాశ్ గౌడ్ మాట్లాడుతూ, రెండు వేల మంది విద్యార్థులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను గుర్తించి సన్మానించడం మెమోంటోలను బహుకరించడం సంతోష కారణమన్నారు. చదువుకునే వారిని గుర్తించి ప్రోత్సహించడం ద్వారా వారు మరింత ముందుకు వెళ్లడానికి వీలు ఉంటుందన్నారు. నిర్వాహకులు సానెం శ్రీనివాస్ గౌడ్, మీసాల లక్ష్మీ నివాస్ లు మాట్లాడుతూ, సీఎస్ఎం ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాఠశాలలకు, విద్యార్థులకు చేయూతనిచ్చే అనేక కార్యక్రమాలను చేపడుతు వస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాఘవేంద్ర హాస్పిటల్స్ నిర్వాహకులు డాక్టర్ కమలాకర్ శర్మ నాయకులు తలారి అశోక్, పలుగుచెరువు మహేశ్, రాజేంద్రనగర్ మండల గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘం ప్రధాన కార్యదర్శి జి.శరవణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.




విద్యార్థులను అభినందిస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

# విద్యార్థుల ఆందోళనపై కలెక్టర్ స్పందన

## సమస్యల పరిష్కారానికి అధికారులకు కఠిన ఆదేశాలు

గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 31 (నమస్తే ఉదయం) విద్యార్థుల భద్రతపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన పాఠశాలపై కఠిన చర్యలు తీసుకున్నామని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ అధికారులను ఆదేశించారు. గురువారం ఉండవల్లి మండలం అలంపూర్ చౌరస్తాలోని మహాత్మా జ్యోతిబా ఫూలే బి.సి. బాలుర గురుకుల పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న మౌలిక వసతుల కొరతపై రోడ్డెక్కి ఆందోళనకు దిగిన నేపథ్యంలో, జిల్లా కలెక్టర్ పాఠశాలను స్వయంగా సందర్శించి, ఉపాధ్యాయులు, విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలను విని, పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకునేందుకు అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థులు ఎదుర్కొంటున్న ఏదైనా సమస్యను చట్టబద్ధంగా సంబంధిత అధికారులకు తెలియజేయాలని, మీ భద్రత మాకు అత్యంత ప్రాధాన్యమైనదిగా భావిస్తున్నామని, రోడ్డెక్కే ప్రయత్నాలు ప్రమాదాలకు దారితీయే అవకాశముండటంతో అలాంటి పరిస్థితి మళ్లీ ఎట్టి పరిస్థితుల్లోనూ తలెత్తకూడదని అన్నారు. పాఠశాలలో విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన డిప్యూటీ వార్డెన్ రజిత, సూపర్వైజర్ నవీన్‌లను సస్పెండ్ చేసినట్లు తెలిపారు. ప్రిన్సిపాల్, వార్డెన్, హౌస్‌మాస్టర్‌లపై మెమో జారీ చేసినట్లు తెలిపారు. విద్యార్థులపై బెదిరింపులకు



పెడుతున్న పాఠశాల భవనాన యజమానిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం ఉన్న నాలుగు మరుగుదొడ్లను ఉపయోగించుకొనాలని, నెల రోజులలో అందరికీ సరిపడేలా కొత్త మరుగుదొడ్లు, బాత్రూంలను నిర్మించి అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. విద్యార్థులకు ప్రతిరోజూ మెనూ ప్రకారం న్యాయమైన పౌష్టికాహారం తప్పనిసరిగా అందించాలన్నారు. నాణ్యతలేని బియ్యాన్ని వెంటనే తిరిగి పంపి మంచి బియ్యాన్ని తెప్పించుకోవాలని, దీనిలో ఎలాంటి నిర్లక్ష్యం జరిగినా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. పాఠశాలలో ఆర్.ఓ. ప్లాంట్ పనిచేయడం లేనందున తాగడానికి వెంటనే మినరల్ వాటర్ అందించాలని ఆదేశించారు. విద్యార్థుల పట్ల నిత్యం బాధ్యతతో ఉండాల్సిన ఉపాధ్యాయులు నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని, విద్యార్థుల ఆరోగ్యం, విద్య, భద్రత విషయంలో పూర్తి నిఘా పెట్టాలని తేల్చి చెప్పారు.అనంతరం ఉండవల్లి మండలం కలుగొట్ల గ్రామంలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయము ఆకస్మిక తనిఖీ చేశారు ఇటీవల ఒక విద్యార్థినికి పాము కాటుతో అనుమానంతో ఆసుపత్రికి తరలించిన ఘటనపై ఆమెతో కలెక్టర్ స్వయంగా మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.విద్యార్థుల ఆరోగ్యం అత్యంత ప్రాధాన్యత గల అంశం కావడంతో, పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచి, పాములు , హానికర కీటకాలు దూరంగా ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.పాఠశాల పరిసరాలను ఎప్పుడూ శుభ్రంగా ఉంచాలని స్పష్టంగా పేర్కొన్నారు. మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టికాహారం ప్రతిరోజూ అందించాలని ఆదేశించారు.పాఠశాల రిజిస్టర్లను తనిఖీ చేసి, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు శాతం పూర్తిగా ఉండాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కో ఆర్డినేటర్ అనీల, ప్రధానోపాధ్యాయులు రామ కృష్ణ, కేజీవీవీ ప్రిన్సిపాల్ పరిమళ,సబ్ ఇన్స్పెక్టర్ శేఖర్, వార్డెన్ రేణుక, ఉపాధ్యాయులు,విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



## ఛలో పరిగి పాదయాత్రలో భాగంగా, పథం.. పథం కలుపుదాం - సైన్యమై కదం తొక్కుదాం

గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 31 (నమస్తే ఉదయం) కాంగ్రెస్ జనహిత పాదయాత్ర పేరుతో… "ప్రజల వద్దకు కాంగ్రెస్" సంక్షేమాన్ని తీసుకెళ్లేందుకు లిరాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్చార్జి మీనాక్షి నటరాజన్, , టీపీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ కి, తెలంగాణ ముదిరాజ్ కార్పొరేషన్ ఛైర్మెన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్ శంషాబాద్ మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గడ్డం శేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో అప్ప జంక్షన్ దగ్గర ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చల్ల నరసింహా రెడ్డి , రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు జలపల్లి నరేందర్ ,బండ్లగూడ మేహార్ ప్రేమ గౌడ్ నర్సింగ్ మున్సిపల్ ఛైర్మన్ శ్రీనివాస్ , వైస్ ఛైర్మన్ విజయ్ బాబు పాపిరెడ్డి , ఏ బ్లాక్ బి బ్లాక్అధ్యక్షులు డప్పు నవీన్ కాలేదు నాగేందర్ రెడ్డి యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మాజీ సర్పంచ్ లు హరికృష్ణ డివిజన్ అధ్యక్షులు ఇస్మాయిల్ భాయ్ తాజుద్దీన్ ప్రవీణ్ రెడ్డి కౌన్సిలర్ దుర్గేష్ లింగం యాదవ్ ,గణేష్ నాయక్ , మహిళా నాయకులు ఎంపీటీసీ అశోక్ ,రమాదేవి రవీందర్ నాయక్, డైరక్టర్ లు ప్రేమ్ మల్లేశ్ ,మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, లక్ష్మణ్ ,విష్ణు, రఘు, బిర్లా కృష్ణ ,గజ్జల కృష్ణ, యాదగిరి, గౌస్ ,విగ్నేష్ , చందు యాదవ్, సంజు ,రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఒరిజినల్ సర్టిఫికెట్స్ ఎవరికైనా కనిపిస్తే అప్పగించగలరని మనవి

### కడవెండి గ్రామానికి చెందిన గువ్వల ప్రవీణ రాణి వేడుకోలు



జనగామ, జూలై 31 (నమస్తే ఉదయం): జిల్లా లోని దేవరుప్పుల మండలం కడవెండి గ్రామానికి చెందిన విద్యార్థిని తన ఒరిజినల్ సర్టిఫికెట్లు తమ గ్రామం కడవెండి నుండి దేవరుప్పుల మండల కేంద్రానికి వెళుతుండగా మార్గంమధ్యలో ఎక్కడో పడిపోయాయని, ఇన్ని సంవత్సరాలు కష్టపడి చదివి ఉద్యోగం సాధించడానికి సర్టిఫికెట్లు పొందానని ఆ ఒరిజినల్ సర్టిఫికెట్స్ ఎక్కడో పడిపోయేసరికి ఆవేదనకు గురయ్యారు. ఆచూకీ కోసం గురువారం ఒక ప్రకటన ద్వారా వెల్లడించారు. వివరాల్లోకి వెళితే.. దేవరుప్పుల మండలంలోని కడవెండి గ్రామానికి చెందిన గువ్వల ప్రవీణ రాణి తండ్రి సోమయ్య అను విద్యార్థిని తన ఒరిజినల్ సర్టిఫికెట్లైన టెన్త్ మెమో, ఇంటర్ మెమో, డిగ్రీ మెమో, డిగ్రీ ప్రొవిజనల్ సర్టిఫికెట్, ఒకటో తరగతి నుండి డిగ్రీ వరకు ఉన్న ఒరిజినల్ స్టడీ సర్టిఫికెట్లు, డిగ్రీ పూర్తి చేసిన టీసీ తదితర ఒరిజినల్ సర్టిఫికెట్లు ఒక కవర్ లో భద్రపరచుకొని ఆన్లైన్ అప్లికేషన్ చేయడానికి జూలై 24వ తేదీన కడవెండి గ్రామం నుండి దేవరుప్పుల మండల కేంద్రానికి వెళ్లడానికి కడవెండి నుండి సీతారాంపురం స్టేజ్ వద్దకు ఒక ఆటోలో వచ్చి అక్కడి నుండి మరొక ఆటోలో దేవరుప్పుల మండల కేంద్రానికి బయలుదేరి వెళుతుండగా మార్గం మధ్యలో ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఉన్న కవర్ ఎక్కడో పడిపోయినదని, ఆ రోజు తను ప్రయాణం చేసిన రోడ్డు మార్గంలో వెతికానని తెలిసిన వారిని కూడా అడిగానని అయినా తన ఒరిజినల్ సర్టిఫికెట్ల ఆచూకీ తెలియలేదన్నారు. పరిసర ప్రాంత వాసులను తనకు సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్లు అప్పగించి మేలు చేయగలరని కోరుతున్నానని తెలిపారు. ఒకవేళ నా ఒరిజినల్ సర్టిఫికెట్లు ఎవరికైనా కనిపిస్తే ఈ ఫోన్ నెంబర్ కు 8790185421 ఆచూకీ తెలుపగలరని మనవి చేస్తున్నానని వేడుకున్నారు.



నిశ్చితార్థం కార్యక్రమంలో సాయి సాకేత్ రెడ్డి,, ఐశ్వర్య రెడ్డిలను ఆశీర్వదిస్తున్న బంధువులు

## ఘనంగా గద్వాల ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి కుమారుడు బండ్ల సాయి సాకేత్ రెడ్డి , ఐశ్వర్య రెడ్డిల నిశ్చితార్థం

గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 31(నమస్తే ఉదయం) గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, జ్యోతి దంపతుల కుమారుడు సాయి సాకేత్ రెడ్డి, ఐశ్వర్య రెడ్డిల నిశ్చితార్థం ఘనంగా జరిగింది.సూర్యాపేట జిల్లా కేంద్రంలో సదాశివారెడ్డి గార్డెన్ లో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, జ్యోతి దంపతుల ఏకైక కుమారుడు బండ్ల సాయి సాకేత్ రెడ్డి , ఐశ్వర్య రెడ్డి ల నిశ్చితార్థ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు గౌని నాగి రెడ్డి, పెబ్బేర్ మార్కెట్ చైర్ పర్సన్ గౌని ప్రమోదిని పాండేశ్వర్ రెడ్డి, మాజీ మార్కెట్ డైరెక్టర్ మూలమల్ల వెంకటేశ్వర్ రెడ్డి, మూలమల్ల గోపాల్ రెడ్డి, గౌని దయానంద్ రెడ్డి, గౌని రంగారెడ్డి, గౌని యుగంధర్ రెడ్డి, గౌని పృథ్వి కుమార్ రెడ్డి, కందూర్ లక్ష్మీకాంత్ రెడ్డి , కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



దళిత నేత కల్లు గోపాల్ కూతురు వివాహ వేడుకల్లో పాల్గొన్న బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి వై శ్రీధర్

## ఘనంగా దళిత నేత కళ్ళు గోపాల్ కూతురు వివాహం

గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 31 (నమస్తే ఉదయం) రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని హైదర్గూడ చెందిన దళిత అసోసియేషన్ ఫర్ రైట్స్ ఎంపవర్మెంట్ రాష్ట్ర అధ్యక్షుడు కళ్ళు సులోచన, కళ్ళు గోపాల్ ఏకైక పుత్రిక చిరంజీవి భావన తో చిరంజీవి సాయి సందీప్ , వివాహం రాజేంద్రనగర్, డైరీ ఫార్మ్ చౌరస్తా రాయల్ హయత్ కన్వెన్షన్ ఫంక్షన్ హాల్ లో జరిగింది.ఈ కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి వై శ్రీధర్ ,డి యాదగిరి , నందం వారి కుటుంబ సమేతంగా వధూవరులను ఆశీర్వదించారు.




## ఐజా మండల కేంద్రంలో శ్రీకృష్ణవేణి ప్రైవేట్ స్కూల్స్ బస్సులపైన ప్రత్యేక తనిఖీలు చేపట్టిన జోగులాంబ జిల్లా ఆర్టిఏ అధికారులు

గద్వాల జిల్లా ప్రతినిధి జూలై 31(నమస్తే ఉదయం) గత కొన్ని రోజులుగా గద్వాల జిల్లాలో ఆర్టిఏ అధికారులు సుడిగాలి పర్యటన చేస్తూ, ప్రవేట్ స్కూల్ బస్సులను ఆపి తనిఖీలు చేస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించిన బస్సులను సీజ్ చేస్తున్నారు ఆర్టీఏ అధికారులు. స్కూల్ బస్సులు కండిషన్ లేకున్నా, ఫిట్నెస్ , పర్మిషన్ లేకున్నా డ్రైవర్లకు డ్రైవింగ్ లైసెన్స్ లేకున్నా రోడ్లపైకి అట్టి వాహనాలు వస్తే అలాగే స్కూల్ బస్ డ్రైవర్లు ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తే ఉపేక్షించేదే లేదన్నారు గద్వాల జిల్లా ఆర్టిఏ అధికారులు.అందులో భాగంగానే అల్లంపూర్ నియోజకవర్గం, ఐజా మండల కేంద్రంలో శ్రీ కృష్ణవేణి ప్రైవేట్ స్కూల్ బస్సులను తనిఖీలలో భాగంగా బస్సుల యొక్క ఫిట్నెస్, పర్మిషన్ డ్రైవర్లకు సంబంధించిన లైసెన్సులను క్షుణ్ణంగా పరిశీలించినట్లు ఆర్టిఏ అధికారులు రాములు ఈ సందర్భంగా తెలిపారు.

## వివాహ వేడుకల్లో పాల్గొన్న ప్రముఖులు

గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 31(నమస్తే ఉదయం)జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్ లో గొంగళ్ల విజయ్ కుమార్ కూతురు సింధు మల్లేష్ ల వివాహ మహోత్సవ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ గొంగళ్ల రంజిత్ కుమార్ ఆహ్వానం మేరకు ముఖ్య అతిథులు వివాహ వేడుకలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత,తెలంగాణ క్రాంతి దళ్ అధ్యక్షుడు డాక్టర్ సంఘం రెడ్డి పృథ్వీరాజ్ యాదవ్,మార్కెట్ యార్డు చైర్మన్ కుర్వ నల్ల హనుమంతు,




జిల్లా గ్రంథాలయ చైర్మన్ నీలి శ్రీనివాసులు, అలంపూర్ మాజీ ఎమ్మెల్యే అబ్రహం, కాంగ్రెస్ పార్టీ గద్వాల ఇంచార్జీ కె.సరిత తిరుపతయ్య, బీఆర్ఎస్ నాయకులు కురువ విజయ్ కుమార్, మీడియా ప్రతినిధులు చుక్క సుదర్శన్ నల్లన్న, బాబన్న, రాజు వివిధ పార్టీల నాయకులు మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి, దేవరి మల్లప్ప, సాయిబాబా, జ్యోతి గోపాల్, మల్దకల్ బాబు, నరేందర్, కిషోర్ కుమార్, ప్రజా ప్రతినిధులు, కుల సంఘాలు, విద్యార్థి సంఘాలు, డాక్టర్లు, ప్రైవేటు స్కూల్ మేనేజ్మెంట్, అడ్వకేట్స్, మీడియా మిత్రులు హాజరైన వారిలో ఉన్నారు.ఈ కార్యక్రమంలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా కన్వీనర్ బుచ్చిబాబు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



## పొగాకు రహిత సమాజం కోసం కృషి

ధరూర్, జూలై31(నమస్తే ఉదయం)పొగాకు రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జాంపల్లీ మండల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పరుమాల రేవతి అన్నారు. గురువారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్స వాన్ని పురస్కరించుకొని జాంపల్లి లోని ఎంపీపీ స్కూల్ విద్యార్థులు పొగాకు వాడకం వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు ప్లే కార్డుల నినాదాలు ద్వారా విశదీకరిస్తూ అవగాహనా ర్యాలీని నిర్వహించారు. అనంతరం పొగాకు ఉత్పత్తుల వలన జరిగే నష్టాలను నాటకం రూప ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు రేవతి మాట్లాడుతూ... ప్రతి ఏటా క్యాన్సర్ ద్వారా మరణిస్తున్న వారిలో 25 శాతం మందికి పొగాకు కారణం అవుతోందని తెలిపారు. ప్రతి ఏడాది చాలా మంది పరోక్షంగా సిగరెట్ పొగ పీల్చడం ద్వారా మరణిస్తున్నారు. పొగాకు వాడకం వల్ల సంతనోత్పత్తి సమస్యలు కూడా వచ్చే అవకాశం ఉందన్నారు.. ఇన్ని అనర్థాలకు దారి తీసే పొగాకు నుంచి ప్రజలకు విముక్తి చేయడానికి ప్రపంచ ఆరోగ్య సంస్థ 1988లో మే 31వ తేదీని ప్రపంచ పొగాకు వ్యతిరేక దినంగా ప్రకటించింద న్నారు. అందువల్ల సిగరెట్, బీడీలు, గుట్కా, పాన్ పరాగ్ మొదలైన పొగాకు ఉత్పత్తులు వాడరాదనీ ఈ సందర్భంగా వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ రాజు, అంగన్వాడీ టీచర్ సత్యమ్మ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు..

# దేవరోప్పుల మండలంలో కలెక్టర్ విస్తృత పర్యటన

**ఫర్టిలైజర్ షాపులు, పీహెచ్సీ,జడ్పీ హైస్కూల్, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పరిశీలన**

**స్టాక్ వివరాలు పక్కగా తెలియాలి**

**రిజిస్టర్ లన్ని అప్డేట్ ఉండాలి**

**నిబంధనలను ఉల్లంగిస్తే చర్యలు**

**ముందస్తు పరీక్ష లు ముఖ్యం**

**ప్రజల ఆరోగ్యం పట్ల ప్రత్యేక పర్యవేక్షణ**

**వంద శాతం ఉత్తిర్ణతే లక్ష్యం**

**ప్రాక్టీస్ చేస్తే ప్రతీది సులభమే**

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

జనగామ, జుల్తై 31 (నమస్తే ఉదయం): జిల్లా లోని దేవరుప్పుల మండలంలో గురువారం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ విస్తృత పర్యటనలు చేసారు. ముందుగా ఫర్టిలైజర్ షాప్ లను కలెక్టర్ సందర్శించి.. ఇప్పటివరకు ఆ షాప్ లో జరిగిన యూరియా అమ్మకాల రిజిస్టర్ లను, స్టాక్ రిజిస్టర్ లను పరిశీలించారు జిల్లాలో సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయని ఎవరైనా అధిక ధరలకు అమ్మిన... అవసరం లేని వారికి యూరియా అమ్మిన సంబంధిత వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు

షాప్‌లో ఎంత యూరియా స్టాక్ ఉంది దానికి



ఫర్టిలైజర్ షాప్‌లో ఎరువుల రికార్డును పరిశీలిస్తున్న కలెక్టర్

సంబంధించిన రేట్లు తదితర సమాచారం ప్రజలకు తెలిసే విధంగా ప్రతి షాప్‌లో బయట బోర్డు ను ప్రదర్శించాలన్నారు

అనంతరం పిహెచ్సి ని సందర్శించి...ఒపీ, సిబ్బంది అటెండెన్స్ రిజిస్టర్, మందుల నిల్వ లను పరిశీలించి... ఆ తరువాత వైద్యాధికారులతో కలెక్టర్ రివ్యూ ఏర్పాటు చేశారు

రోజు ఓపి కి ఎంత మంది వస్తున్నారు? వారిలో ఎంతమంది జ్వరంతో బాధపడుతున్నారు... అలాంటి వారికి సంబంధించి మీరు తీసుకున్న చర్యలు ఏంటి ఇప్పటివరకు ఎన్ని టెస్టులు జరిగాయి అడిగి తెలుసుకున్నారు

అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... ప్రభుత్వ ఆసుపత్రుల మీద ప్రజలకు ఎంతో నమ్మకం ఉన్నదని...అందుకు తగ్గట్టు గా నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించాలని... ముఖ్యంగా ఈ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు

వర్షాకాలం ముగిసే వరకు... ప్రజల ఆరోగ్యం మీద మరింత శ్రద్ధ వహించాలన్నారు... ఓపి కి వచ్చే ప్రతి ఒక్కరికి టెస్టులు జరగాలని... ముందస్తుగా వారికి వైద్యం అందిస్తే జ్వరంతో బాధపడకుండా ఉంటారన్నరు

అనంతరం జడ్పీ హై స్కూల్ కి వెళ్లిన కలెక్టర్ ఉపాధ్యాయుల అటెండెన్స్ రిజిస్టర్ ని పరిశీలించి... 10 వ తరగతి విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు.

ఎలా జరుగుతున్నాయి క్లాస్ లు, అన్ని సబ్జెక్ట్ లు అర్థమవుతున్నాయా, ఏ ఏ సబ్జెక్ట్ లు మీకు ఇబ్బంది గా ఉంటున్నాయి అని విద్యార్థులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు

ఈ సందర్భంగా వివిధ సబ్జెక్ట్ లలో విద్యార్థుల సామర్థ్యలను కలెక్టర్ పరీక్షించారు .ప్రాక్టీస్ చేస్తే ఏదైనా సులభం గా అనిపిస్తుందని... ఒకటికి రెండు సార్లు చదవాలని... డౌట్ లు రాగానే ఉపాధ్యాయులను అప్పటికప్పుడు అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు

వంద శాతం ఉత్తిర్ణత సాధించే దిశగా ఉపాధ్యాయులు కూడా లక్ష్యం పెట్టుకోవాలన్నారు .

అనంతరం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి... లబ్ధిదారులతో కలెక్టర్ మాట్లాడి పలు విషయాలు తెలుసుకున్నారు .ఎప్పుడు స్టార్ట్ చేసారు... ఇసుక, మొరం విషయాల్లో ఏమైన ఇబ్బందులు ఉన్నాయా, మేస్త్రి లు క్రమం తప్పకుండ వచ్చేలా చూసుకోవాలని సూచించారు ఈ కార్యక్రమం లో విద్య, వైద్య, వ్యవసాయ, హౌసింగ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.DAMODHAR REDDY. "RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733